# సాయి కృష్ణాయ చరణం నమో నమః

(సంగీత నృత్య రూపకం)

పాత్రలు :

1. కృష్ణ
2. మాధవ్
3. శేఖరం
4. ప్రశాంత్
5. శ్రీకాంత్
6. భాస్కర్
7. శ్రీధర్
8. శ్రీనివాస్

పాటలు :

1. ఆనందం ఆనందం
2. ఇంద్రనీలమనివర్ణ
3. స్మృతిపథమున
4. నిత్యానందుని
5. ఎంతభాగ్యమో
6. నా నోట శ్రీసాయి నామమున్నది

పద్యాలు :

1. శ్రీకృష్ణా! యదుభూషణా!
2. యుగధర్మ పద్ధతుల్ విగళితమైయుండ

# సాయి కృష్ణాయ చరణం నమో నమ:

(సంగీత నృత్య రూపకం)

రచన: యం.యస్ ప్రకాశరావు

(శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల కోసం శ్రీకృష్ణమూర్తి విగ్రహం, మందిరం అందంగా అలంకరించబడి ఉంటుంది. కృష్ణ పిల్లలతో మందిర ప్రవేశం చేసి)

కృష్ణ : (భక్తితో నమస్కారం చేస్తూ)

పద్యం

శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగారరత్నాకరా!
లోకద్రోహి నరేంద్రవంశదహనా! లోకేశ్వరా! దేవతా
నీక బ్రాహ్మణగోగణార్తి హరణా! నిర్వాణ సంధాయకా!
నీకున్మ్రొక్కెద ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ!

కృష్ణా! వాసుదేవా! పాహిమాం! పాహిమాం! త్రిభువన సమ్మోహనమైన నీ దివ్యమంగళరూపాన్ని నిత్యం దర్శించే మహాభాగ్యాన్ని ప్రసాదించావు. మరుజన్మ లేకుండా మానవ జీవితాన్ని ధన్యం చేసుకునే నీ దివ్య సుందర మధుర నామస్మరణం వరప్రసాదంగా అనుగ్రహించావు. నా ప్రణతులందుకో స్వామీ! నీ జన్మదినాన్ని వ్రేపల్లెలో గోపాలకులెంత వైభవంగా జరుపుకున్నారో? ఈరోజు మా బిడ్డలంతా వేణుగాన వినోదివైన నిన్ను గానంతో, నృత్యంతో భక్తితో ఆరాధించుకుంటున్నారు. ఆశీర్వదించు తండ్రీ. (పిల్లలు నృత్యం చేస్తారు)

పాట

పల్లవి : ఆనందం ఆనందం శ్రీకృష్ణ జనన మహోదయం
అష్టమి రోహిణీ ప్రొద్దునా
అష్టమ గర్భము నందు ॥ఆనందం॥

చ. 1. మేఘమొకడు గర్జించేను మేఘ శ్యాముడుదయించేను
శ్రావణ నిశీధిని శంఖ చక్ర గదా పద్మ శ్రీవత్సముతో ॥ఆనందం॥

చ. 2. యమున పొంగి సాధువయ్యే జలరాశులు నింగికెగసే

విహంగతతులు పాట పాడే
విరిసెను పూవులు వనమున ॥ఆనందం॥

కృష్ణ : శేఖరం! ఆ పూర్ణావతారమూర్తి ఎలా చిరునవ్వులు చిందిస్తున్నాడో చూశావా! ఆ వంశీమోహనుడి ఆటా, పాటా అన్ని సమ్మోహనాలే. పండితులు, పామరులు, మహర్షులు, మహానుభావులు, గోవులూ, గోపాలకులూ, ఒకరేమిటి విశ్వమంతా ఆ మురళీధరుని మురళీరవళికి పరవశించి పోయారంటే ఆ చిన్మయమూర్తిని దర్శించి తరించారంటే వారెంత ధన్యులో? నిరంతరం ఆ ప్రేమమూర్తి దర్శన, స్పర్శన సంభాషణా సౌభాగ్యం పొందారంటే అది ఎన్ని జన్మల పుణ్యఫలమో?

మాధవ: ఔను కృష్ణా! వారంతా వారధి కట్టిన వానరులై ఉంటారు. అందుకే పరమాత్మ, కోరుకోకుండా వారికి తన దివ్య ప్రేమ పంచి ఇచ్చాడు. పూవు పుట్టగానే పరిమళించినట్టు తన దివ్యలీలల్ని పుట్టిన క్షణం నుండీ ప్రదర్శించాడు. తాను శ్రీమన్నారాయణుని అవతారమని ఋజువు చేశాడు.

కృష్ణ : ఆ లీలావతారికి పాలిచ్చి పెంచిన యశోద ఆ స్వామి ప్రదర్శించిన లీలలు చూసి ఎంత పరవశించి పోయిందో కదా!

మాధవ: ఆ యశోద భక్తి పారవశ్యాన్ని చూడు కృష్ణా!

పాట

పల్లవి : ఇంద్రనీలమణివర్ణా కన్నా! నీ చైదములెవరెరుగుదరన్నా!

చ. 1. మందలించు మాతకు గళమున బ్రహ్మాండము జూపించితివి
రోటగట్ట నలకూబరమణిగ్రీవుల శాపము విగళించితివి ॥ఇంద్ర॥

చ. 2 రాళ్ళవాన నడలు గో గోపకుల గోవర్ధన గిరిని ఎత్తి కాచితివి
వత్సములై సుతులై శ్రీకృష్ణుడివై బ్రహ్మకు జ్ఞానము నొసగితివి ॥ఇంద్ర॥

శేఖరం: కృష్ణా! శ్రీకృష్ణ పరమాత్మను భక్తి విశ్వాసాలతో నీ హృదయంలో కట్టిపడేశావు. అంతేకాదు పసివారిలో కూడా కృష్ణభక్తి బీజాలు నాటి నీ జన్మ తరింపజేసుకున్నావు

మాధవ: ఇంకా తన జన్మ తరించలేదనీ! కృష్ణ సాన్నిహిత్యం తనకు లభించలేదనీ మా కృష్ణ బాధపడుతూ ఉంటాడు. మా కృష్ణ మనోభావాల్ని వినండి.

పాట

పల్లవి : స్మృతిపథమును చూచాయగనున్నది ఇది నిజమేనా స్వామీ
బృందావనమున నీ సయ్యాటలలో
నేనున్నానా నీతో కృష్ణా! ॥స్మృతి॥

చ. 1. గోవర్ధన గిరిని ఎత్తినప్పుడు నేనెందుకున్నానో దేవా
మహాబలీయుడై కాళీయు తలపై నీవు నర్తించినప్పుడు
మధుర మురళీగానో కాలి గజ్జెగానో
గోటిధూళిగానో నీతోలేనా ॥స్మృతి॥

చ. 2. నా పిచ్చిగానీ నిను విడిచినది ఎప్పుడు
విడిచినేనెటుల మనగలనా
స్మృతి పథమున భ్రమలన్నియు మానిపి
పూర్వజ్ఞానము దివ్య దర్శనము
ఎప్పుడోసగెడవో స్వామీ! ॥స్మృతి॥

శేఖరం: నిరంతరం ఆ బాలగోపాలుని గురించే ఆలోచించే మీ మనస్సులో ఈ సందేహాలెందుకు తలెత్తాయి కృష్ణా!

కృష్ణ : శేఖరం! ఆ బాధ నీకెలా అర్థమవుతుంది. అటువంటి పూర్ణావతారమూర్తి, దివ్యసుందరమూర్తి, ప్రేమామృతమూర్తి ఈ భూమిపై మళ్లీ అవతరిస్తాడా? వారి దివ్య దర్శన సౌభాగ్యం పొందే అదృష్టం మళ్ళీ మానవాళికి లభిస్తుందా?

ప్రశాంత్: కృష్ణా! భగవద్గీతను ఎన్నోమార్లు భక్తితో పఠించి ఉంటావు. పారాయణం చేసి ఉంటావు. సంశయాత్మా వినశ్యతి నసుఖం సంశయాత్మన: అని భగవానుడు చెప్పలేదా?

కృష్ణ : సందేహం కాదు ప్రశాంత్! ఆ దివ్యలీలామోహనుడి అవతారకాలంలో మనం లేకపోయామే కన్నులారా వారిని దర్శింపలేకపోయామే అని నా ఆవేదన

మాధవ్: తన అనుగ్రహాన్ని అందించడానికి తర తమ తారతమ్యాలు గాని, పండితుడూ పామరుడూ అన్న బేధాన్ని గాని, కురూపి, సౌందర్యరాశి అన్న తేడా గాని పాటించని ఆ అమృత ప్రేమమూర్తి తిరిగి ఈ భూమండలం మీద

అవతరించడేమోనని మా కృష్ణ సందేహం.

కృష్ణ : సందేహం కాదు శేఖరం! ప్రత్యక్షర సత్యం అటువంటి అద్భుత అవతారం మళ్ళీ ఈ అవనీతలంపై రాదు, రాబోదు.

శేఖరం: భగవంతుడి అవతరణ గురించి నువ్వు నిర్ణయించగలవా కృష్ణా! ఆ గోవర్ధనగిరిధారి, పవిత్రాణాయ సాధూనాం వినాశచ దుష్కృతాం ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే అని వాగ్ధానం చెయ్యలేదా?

ప్రశాంత్: యధాయధాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత అభ్యుద్ధాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ అని మాట ఇవ్వలేదా?

మాధవ్: ఇచ్చాడు, కాని వారి బోధనలు విని ఆచరించని మనకోసం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి అవతరిస్తాడా? తన దివ్యదర్శన సౌభాగ్యం అనుగ్రహిస్తాడా?

శేఖరం: అవతరిస్తాడా అని ప్రశ్నించకండి మాధవా! అవతరించాడు. కోట్లాది యోగుల, భక్తుల ప్రార్థన ఫలితంగా అవతరించాడు. తన దివ్య దర్శన సౌభాగ్యం అనుగ్రహించాడు, వారి చేయి పట్టి సన్మార్గంలో నడిపించాడు, నడిపిస్తున్నాడు.

కృష్ణ : నిజమా శేఖరం! నా మురళీ గానలోలుడు, నా గోవర్ధన గిరిధారి, నా నవనీతచోరుడు, నా బృందావన విహారి అవతరించాడా! ఎక్కడ! ఏ దివ్య క్షేత్రంలో, ఏ పుణ్యనదీ తీరంలో?

శేఖరం: మన రాష్ట్రంలోనే, అనంతపురంజిల్లాలో, పుట్టపర్తి అనే గ్రామంలో, చిత్రావతీ పుణ్యనదీ తీరంలో బాలగోపాలుడు అవతరించాడు.

ప్రశాంత్: బాలకృష్ణునిగా కరణం సుబ్బమ్మ అనే భక్తురాలికి దర్శనమిచ్చి తాను నందగోపాలుడనని చిన్నప్పుడే నిరూపించాడు.

శేఖరం: గోవిందకృష్ణ జై, గోపాలకృష్ణ జై గోపాల బాల రాధ కృష్ణజై అని కృష్ణ నామగానంలో భక్తజన సందోహాన్ని ఉర్రూతలూగించాడు. భక్తిగానలహరితో పరవశింపజేశాడు.

కృష్ణ : నాకు నమ్మకం కలగడంలేదు శేఖరం. ఏమీ అనుకోకు. నా స్వామి ఏ దివ్యరూపంతో, ఏ పుణ్యనామంతో అవతరించాడు?

శేఖరం: అరవింద నయనాలతో, జటాజూటందో, సుందర దరహాసంతో

కాషాయాంబరంతో అభయహస్తంతో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా అనే నామంతో అవతరించాడు.

మాధవ్: అని మీరంటున్నారు. నా సందేహం తీర్చండి అప్పుడు మీ మాట నమ్ముతాను. శ్రీకృష్ణ జన్మానికి ముందు బ్రహ్మదేవుడు దేవకీ వసుదేవులకు సాక్షాత్కరించి మీ గర్భవాసాన శ్రీమన్నారాయణుడు అవతరిస్తాడని చెప్పేడు, కృష్ణుడు జన్మించిన వెంటనే కారాగారం తలుపులు ఎవరూ తెరవకుండానే తెరుచుకున్నాయి. యమునానది పాయలై నందునికి దారి ఇచ్చింది. ఆదిశేషుడు పడగ పట్టి శ్రీహరికి స్వాగతం చెప్పాడు. బాబా నందకుమారుడంటున్నారే, మరి అలాంటి అద్భుతాలు బాబా అవతరించినప్పుడు జరిగాయా శేఖరం?

శేఖరం: ఏ పసిబిడ్డనడిగినా ఆ వివరాలు చెబుతాడు మాధవా! శ్రీనివాస్! స్వామి అవతరించిన సమయంలో జరిగిన సంఘటనలు చెప్పమ్మా.

శ్రీనివాస్: సాయిరాం! కృష్ణ జన్మానికి ముందు బ్రహ్మదేవుడు దేవకీ వసుదేవులకు చెప్పినట్టు మా స్వామి భగవాన్ శ్రీ సత్యసాయి అవతరించడానికి ముందు వేంకావధూత అనే యోగి బాబా తాతగారైన కొండమరాజు గారికి మన రత్నాకర వంశంలో భగవంతుడవతరిస్తాడయ్యా అని చెప్పాడు. కృష్ణ జన్మంలో కారాగారం తలుపులు తెరుచుకున్నట్టు స్వామి జన్మించడానికి ముందు కొండమరాజు గారి ఇంట్లో ఎవరూ వాయించకుండానే మేళతాళాలు, మృదంగాలు వాటంతటవే మ్రోగాయి. ఆదిశేషుడు పడగ పట్టినట్టు పొత్తిళ్ళలో ఉన్నప్పుడే స్వామి పడగ చుట్టూ నాగసర్పం చుట్టుకుని ఉంది. ఆ సమయంలో మాతృమూర్తి ఈశ్వరమ్మ బాలుని చుట్టూ ఒక దివ్యప్రకాశాన్ని గమనించింది. కృష్ణావతారంలో యమున నందునికి దారి ఇచ్చినట్టు సాయి అవతారంలో స్వామి ఆజ్ఞకు కట్టుబడి పరమపావనమైన గంగ కైలాసం నుండి ప్రశాంతి నిలయానికి పరుగు పరుగున వచ్చి స్వామి పాదాల్ని కడిగి దివ్య పుష్పాలతో అర్చన చేసింది.

కృష్ణ : విచిత్రంగా ఉందే.

శ్రీనివాస్: బాబాయిగారూ! కృష్ణ పరమాత్మకూ, సాయి పరంధామునికీ ఎన్నో పోలికలున్నాయి. దివ్యాకర్షణలో గాని, మధుర భాషణలో గాని, మహిమలు చూపడంలో కాని, కరుణ జూపి ఆపద్బాంధవుడిగా ఆదుకోవడంలో గాని,

ప్రేమను జూపి మనస్సును పరవశింపజేయడంలో గాని శ్రీ సత్యసాయి సాక్షాత్తు శ్రీకృష్ణపరమాత్మే.

మాధవ: శేఖరం! సజ్జనులను సంరక్షిస్తాననీ, ధర్మాన్ని ఉద్ధరిస్తాననీ చెప్పిన శ్రీకృష్ణ పరమాత్ముని వాగ్ధానం గుర్తుకు తెచ్చావే. మరి బాబా వారు కూడా శ్రీకృష్ణపరమాత్మ అయితే సర్వ జగత్తునూ సంరక్షిస్తాననీ ధర్మోద్ధరణ చేస్తానని వాగ్ధానం చేసి ఉండాలి కదా.

శేఖరం: సాయికృష్ణుడు కూడా అట్లాంటి అద్భుత వాగ్ధానాన్ని మానవాళికి చేశారు.

పద్యం

సీ॥ యుగధర్మ పద్ధతుల్ విగళితమైయుండ
నయమార్గమున త్రిప్పి నడుపు కొరకు
లోకంబులెల్ల కల్లోలమై చెడియుండ
నిష్కల్మషము చేసి నెగడు కొఱకు
దుర్మార్గ బద్ధులై తొలగి దీనతనుండ
సాధు సంరక్షణము సలుపు కొఱకు
కాల సందిగ్ధ విగ్రహ దీప్తులై యుండ
భాష్యార్థ గోప్యముల్ పలుకు కొఱకు
క్ష్మాభారము బాపి భూదేవి మనుపు కొఱకు
త్రేతనొసగిన కోర్కెలు తీర్చు కొఱకు
అవతరించెను అచ్యుతుడవని యందు
సత్యరూపుడై పర్తిలో సత్యముగను.

కృష్ణ : మానవాళికి ఇంత గొప్ప వాగ్ధానం చేయగలిగారంటే, బాబా శ్రీకృష్ణపరమాత్మే అయి ఉండాలి.

శేఖరం: అయి ఉండాలి కాదు కృష్ణా! వారే వీరు!

మాధవ: బాబా చేసిన ఎన్నో అద్భుతాల గురించి చెబుతున్నారు మీరు, మరి ఈ సందేహం తీర్చండి. బృందావనంలో ఒకమారు మహాభక్తుడైన అక్రూరునికి దోసిలిలోని నీళ్ళలో శ్రీమహావిష్ణువుగా దర్శనమిచ్చాడు శ్రీకృష్ణపరమాత్మ.

ప్రశాంత్: ఔను నిజమే. బాబా జీవితంలో ఇట్లాంటి అద్భుతం జరిగిందా అని మీ

సందేహం. మా సాయి సోదరుడు శ్రీధర్ మచిలీపట్నం నివాసి. శ్రీధర్! స్వామి మీ పట్టణంలో ప్రదర్శించిన అద్భుతాన్ని వివరించు.

శ్రీధర్ : సాయిరాం. 1944వ సంవత్సరంలో స్వామి కృష్ణాజిల్లా పర్యటనకు విచ్చేశారు. ఒకరోజు భక్తులందరితో కలిసి స్వామి బందరు సముద్రతీరానికి దయచేశారు. భక్తులందరినీ ఒడ్డునే నిలబడమని తాను మాత్రం సముద్రంలోకి కొంతదూరం నడిచి వెళ్ళేరు. అదృశ్యమైపోయారు. స్వామి ఎక్కడికి వెళ్ళారోనని భక్తులు ఆశ్చర్యపడుతున్న సమయంలో సముద్రంలోంచి పెద్ద శబ్దం వినిపించింది. అందరూ ఆ శబ్దం వినిపించిన వైపుకు చూశారు. అద్భుతమైన రీతిలో శేషతల్పసాయిగా భగవాన్ బాబా దర్శనమిచ్చారు. శేషసాయి అయిన శ్రీమన్నారాయణుడే భగవాన్ శ్రీసత్యసాయి అని అందరికీ అర్థమయింది.

కృష్ణ : అంటే ఆ శ్రీమహావిష్ణువే ఈ మహీవిష్ణువన్నమాట.

మాధవ: భాగవతంలో వర్ణించిన మరో అద్భుతాన్ని వివరించనా! శ్రీధర్.

శ్రీధర్ : మీరు వివరించబోతున్న అద్భుతాన్నీ, అడగబోయే ప్రశ్ననీ ఊహించగలను.

మాధవ: అయితే చెప్పండి.

శ్రీధర్ : బ్రహ్మదేవుడు ఒకమారు లీలామానుషవిగ్రహుడైన శ్రీకృష్ణ పరమాత్ముని పరీక్షించాలని గోవులనీ, గోపాలకులనీ మాయం చేశాడు. పరమాత్మ ఏంచేస్తాడోనని ఎదురు చూశాడు. బాలకృష్ణుడు మాత్రం చిద్విలాసంగా నవ్వుకుంటూ గోవులుగా గోపాలకులుగా రూపాలు ధరించి వ్రేపల్లెకు తరలిపోయాడు. ఏ చీకూ చింతా లేకుండా నెలరోజులు గడిచిపోయాయి. బ్రహ్మదేవుడు తల్లడిల్లిపోయి తన పరీక్షమాని బాలగోపాలుని పాదాలపై పడి క్షమించమని వేడుకున్నాడు. వివిధరూపాలు ధరించడం అవతార పురుషుని అద్భుత లక్షణం.

కృష్ణ : మరి బాబా కూడా ఎప్పుడైనా వివిధ రూపాలు ధరించారా?

శేఖరం: ధరించారు కృష్ణా! ఇతడు నాగపూర్ నివాసి భాస్కర్. వీరి తండ్రిగారు మిలటరీలో పని చేసేవారు.

భాస్కర్: ఒకరోజు ఏమయిందంటే, మిలటరీలో అధికారి అయిన మా నాన్నగారు విధివశాత్తు సమస్యల వలయంలో చిక్కుకున్నారు. జీవితంపై విరక్తి చెంది

ఆత్మహత్యే శరణ్యమనుకున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రివాల్వరు తీసి కణతకు గురి పెట్టుకుని కాల్చుకోబోయేసరికి డోర్‌బెల్ మ్రోగింది. రివాల్వర్ దిండు క్రింద దాచి పెట్టి తలుపు తీశారు. మా నాన్నగారి ప్రాణ స్నేహితుడు, సతీసమేతంగా వచ్చాడు. వెనక కూలీ వారి సామాన్లు మోసుకుని వచ్చాడు. వారిని ఆహ్వానించి కొంచెంసేపు మాట్లాడిన తరువాత....

శ్రీధర్ : వీరి అమ్మగారు లేరని తెలిసి అతని మిత్రుడు, భార్యా మళ్లీ తిరిగి వెళ్ళిపోయారు. వారు వెళ్ళగానే తలుపులు వేసి వెళ్ళి రివాల్వరు కోసం ఇల్లంతా వెతికారు వీరి నాన్నగారు. ఎక్కడా కనపించలేదు. దిండు క్రింద పెట్టిన రివాల్వరు ఎలా మాయమయ్యిందో అని ఆశ్చర్యపోతున్న సమయంలో ప్రశాంతి నిలయం నుండి టెలిగ్రాం వచ్చింది.

భాస్కర్: మా నాన్నగారు దాన్ని అందుకుని చదివారు. “యువర్ ఇన్‌స్ట్రుమెంట్ ఈజ్ విత్ మి – బాబా” అని దాని సారాంశం. మా నాన్నగారు దిగ్భ్రాంతి చెందారు. మా అమ్మ స్వామిని ఆరాధ్యదైవంగా ఆరాధించేది. ఎప్పుడూ సత్యసాయి నామస్మరణ చేసేది. ఆమె మాంగళ్యాన్ని కాపాడడానికే బాబా రివాల్వర్ మాయం చేశారని అర్థమై మా నాన్నగారికి జ్ఞానోదయమయింది. అప్పటినుండి బాబా శ్రీచరణాలను నమ్ముకుని స్వామి వారి సంకీర్తన చేసుకుంటూ స్వామి సేవకే అంకితమైపోయారు.

కృష్ణ : బాబా తన జీవితంలో ఇన్ని అద్భుతాలు చేశారా.

శేఖరం: చేశారు. లీలామానుష వేషధారి అయిన కృష్ణ పరమాత్మే భగవాన్ బాబాగా అవతరించినప్పుడు అద్భుతాలు జరగడంలో ఆశ్చర్యమేముంది. కృష్ణా!

ప్రశాంత్: వినండి కృష్ణా! ఒకరోజు గో గోపాలకులు బృందావనం దాటి పచ్చిక కోసం అడవిలోకి వెళ్ళారు. హఠాత్తుగా అడవిలో కార్చిచ్చు రగిలింది. అడవి దహించుకుపోతోంది. “కృష్ణా! కృష్ణా! కాపాడు” అని గోపాలకులు ఆర్తనాదాలు చేశారు. మరుక్షణంలో విలాసైంగా అగ్నిని అందుకుని మ్రింగివేశాడు పరమాత్మ.

కృష్ణ : అగ్నిని నుండి ఆపన్నులను రక్షించిన వైనం బాబా జీవితంలో కూడా ఏదైనా ఉన్నదా? అనుమానంతో కాదు ఆసక్తితో అడుగుతున్నాను చెప్పు.

ప్రశాంత్: లేకేం. మెక్సికోలోని టెకాటేలో భగవాన్ శ్రీసత్యసాయి బాబాని సాక్షాత్తు ఆ గీతాచార్యుడిగా నమ్మిన ఇంద్రాదేవి అడవికి సమీపంలో "సాయి నిలయం" అనే తన యోగా కేంద్రాన్ని నిర్వహిస్తూ ఉంది. ఒకసారి భయంకరమైన కార్చిచ్చు చెలరేగి వేలాది ఎకరాల అడవి, ఇళ్ళు దగ్ధమయ్యాయి. ఇంద్రాదేవిగారి సాయి నిలయం కూడా దగ్ధమైపోతుందనుకున్నారు అందరూ. దూరప్రాంతంలో ఉన్న ఇంద్రాదేవి ఈ విషయం విని సాయినిలయాన్ని రక్షించమని బాబాను కన్నీటితో ప్రార్థించింది. ఆ కరుణామయుడు కరిగిపోయాడు. మంటలు చల్లారిన తర్వాత చూస్తే "సాయి నిలయం" ముచ్చట గొలుపుతూ ముందరిలాగే ఉంది.

కృష్ణ : సాయి కృష్ణుని లీలలు వింటూంటే శ్రీమద్భాగవతాన్ని చదివినట్టూ, శ్రీకృష్ణ లీలల్ని దర్శిస్తున్నట్టూ ఉంది శేఖరం.

శేఖరం: ఉంటుంది. ఒక్కమారు మీ మనోఫలకంలో రాధాదేవిని స్మరించి దర్శించండి. బృందావనంలో అణువణువునా ఆమె గోపాలబాలుణ్ణి దర్శించింది. అలాంటి రాధ భక్తిని మనం అనుసరిస్తే భగవాన్ బాబాలో శ్రీకృష్ణ పరమాత్మ విశ్వరూపాన్ని సందర్శించగలం.

ప్రశాంత్: రాధాదేవి నిర్మల భక్తిని మన పిల్లలు కళ్ళకు కట్టినట్టు ప్రదర్శిస్తారు చూడండి.

పల్లవి : నిత్యానందుని సుందర రూపము నాట్యమాడునా కనుపాపలలో
నందకిశోరుని మోహన రాగము
నిండిపోయెనే నాయెదలో ॥నిత్యా॥

చ. 1. రాధను విడిచి అనురాధను విడిచి
ఎచటకేగెనో నా మనోహరుడు ॥నిత్యా॥

చ. 2. తరువు తరువును పూవు పూవును
ప్రశ్నించితి నా మాధవుజాడ ॥నిత్యా॥

మాధవ: మీ మాటలు, పాటలూ వింటూ ఉంటే బృందావనంలో శ్రీకృష్ణ భగవానుని సన్నిధిలో ఉన్నామన్న భావన కలుగుతోంది.

శేఖరం: ప్రశాంత్! కురూపి కుబ్జను ఏ అంగ వైకల్యంలేని అపురూప సౌందర్యరాశిగా మార్చేడు శ్రీకృష్ణ పరమాత్మ. స్వామి భక్తులకు కలిగిన అలాంటి అనుభవం

వారికి చెప్పాలి.

ప్రశాంత్: ఏం అట్లాంటి కుతూహలం కలిగింది?

శ్రీకాంత్: అవతార మూర్తులను గుర్తించలేని మనోవైకల్యాన్ని తొలగించుకోవాలి కదా!

శేఖర్: సరే! మిసెస్ అండర్సన్ అనే భక్తురాలు భగవాన్ దివ్య జన్మదినోత్సవాలలో పాల్గొనాలని అమెరికా నుంచి వచ్చారు. వారి అనుభవం చెప్పు శ్రీకాంత్.

శ్రీకాంత్: ఓం శ్రీ సాయిరాం, మిస్సెస్ అండర్సన్ స్వామి భక్తురాలు, ఒకమారు భగవాన్ జన్మ దినోత్సవానికి ప్రశాంతి నిలయం వచ్చారు. ఆ రోజు ఉదయం స్వామి తలపై పుష్పాలతో తల్లి ఈశ్వరాంబగారు, పెద్దలూ తైల ప్రోక్షణ చేస్తున్నారు. ఆ సన్నివేశం చూసి మైమరచిపోయిన శ్రీమతి అండర్సన్‌కు కూడా స్వామి శిరస్సుపై పుష్పంతో నూనె పెట్టాలన్న కోరిక కలిగింది. కానీ ఎలా? పక్షవాతం వచ్చి కుర్చీకి పరిమితమైపోయి నడవలేని తనకా భాగ్యం ఎలా కలుగుతుంది? అని బాధపడ్డారు.

మాధవ: పాపం! స్వామి శిరస్సుపై తైల ప్రోక్షణాభాగ్యం వారికి లభించలేదన్నమాట.

శ్రీకాంత్: వినండి, ఆ క్షణంలో బాబా 'ఆమెకి పుష్పతైలం ఇవ్వండి" అని కస్తూరి గారిని ఆదేశించి, మరుక్షణంలో తానే సింహాసనం నుండి లేచి ఆమె వైపు నడిచి వచ్చారు. శ్రీమతి అండర్సన్‌కి గజేంద్రుణ్ణి కాపడడానికి వైకుంఠం నుండి శ్రీమన్నారాయణుడు పరుగు పరుగున వస్తున్నట్టనిపించింది. ఆమె కళ్ళ వెంట ఆనందభాష్పాలు కారుతున్నాయి. భగవంతుడు ఆమె ఎదుట నిలబడి తల వంచాడు. పుష్పంతో తైల ప్రోక్షణ చేసిందామె. అంతే ఆమె శరీరం పులకించిపోయింది. చిరునవ్వుతో "లేచి నిలబడు" అని దయామయుడైన బాబా ఆమెను ఆజ్ఞాపించారు. భగవంతుని ఆజ్ఞ ఆమె వెంటనే లేచి నిలబడింది. నడవగలిగింది. ఆమె ఆనందానికి అంతులేదు. లక్షలాది భక్తులు "జై సాయిరాం" అని జయ జయ ధ్వానాలు చేశారు. ఆనందభాష్పాలతో ఆమె సత్యసాయి భగవానునికి పాదాభివందనం చేసింది.

శేఖరం: కృష్ణా! అందుకే ఆ శ్రీకృష్ణ భగవానుడే భగవాన్ బాబా అని సాయి భక్తులంతా పరవశించి గానం చేస్తారు.

పాట

పల్లవి : ఎంత భాగ్యమో ఎంతటి సౌభాగ్యమో
భగవానుడు మనకోసం దిగి వచ్చాడతడు
భువిని సత్యసాయిగా వెలిశాడు
భువన చక్రవర్తిగా నిలిచాడు ॥ఎంత॥

చ. 1. గోపాల కృష్ణుని మాపాలి దేవుని
కృష్ణా కృష్ణా శ్రీ కృష్ణా అని గొంతెత్తి పిలిచాము
చల్లని మా నల్లనయ్య కరుణించాడు
భువిని సత్యసాయిగా వెలిశాడు
భువన చక్రవర్తిగా నిలిచాడు ॥ఎంత॥

చ. 2. హృదయాంతరంగ సాయి శ్రీ సత్యసాయిని
సాయీ...సాయీ సాయీ శ్రీ సాయి అని భక్తి ప్రార్థించాము
వరదాభయ దివ్యమూర్తి వరమిచ్చాడు
కరుణారస దివ్య దృష్టి సారించాడు
ప్రేమామృత దివ్య వృష్టి కురిపించాడు ॥ఎంత॥

కృష్ణ : మీరదృష్టవంతులు శేఖరం! భగవంతుడు అవతరించి మన మధ్య నడయాడుతున్నప్పుడు ఆ శ్యామసుందరుణ్ణి తెలుసుకున్నారు. వారి దివ్య దర్శన, స్పర్శన, సంభాషణా సౌభాగ్యాన్ని అనుభవించారు. రాతి విగ్రహాల సన్నిధిలో కూర్చుని ప్రార్థించాను తప్ప నా వంశీమోహనుణ్ణి కనులారా దర్శించలేకపోయాను.

ప్రశాంత్: బాధపడకండి! బాబా మనమధ్యనే ఉన్నారు. హృదయవిదారకంగా ప్రార్థించిన వారికి సజీవమూర్తిగా వారు దర్శనమిస్తారు. విశ్వవ్యాప్తంగా అలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. మరొక్క అద్భుతాన్ని విన్నారంటే స్వామి పాదాల వద్ద శరణాగతులైపోతారు మీరు.

కృష్ణ : ఏమిటది

ప్రశాంత్: కురుక్షేత్ర సంగ్రామం తర్వాత 'బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని' ప్రయోగించి ఉత్తరాగర్భంలోని పరీక్షిత్తుని సంహరించాలనుకున్నాడు అశ్వత్థామ.

భయకంపితులైన పాండవుల ప్రార్థనను మన్నించి పరమాత్మ ఉత్తరాగర్భంలోని పరీక్షిత్తుని రక్షించాడు.

శేఖరం: పశ్చిమ బెంగాల్‌లోని ఒక మారుమూల గ్రామంలో ఉపాధ్యాయుడు. నీతి నిజాయితీలతో జీవించే భీమ్‌సేన్ నిరంతరం స్వామి దివ్య జీవిత చరిత్ర "సత్యం శివం సుందరాన్ని" పారాయణ చేసేవాడు. బాబాని సర్వేశ్వరుడని సేవించేవాడు. 1977వ సంవత్సరం సెప్టెంబరు నెలలో పూర్ణగర్భిణి అయిన భీమ్‌సేన్ భార్య ప్రసవవేదన పడుతూ వారం రోజులైనా కాన్పు కాలేదు. అప్పుడు నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్ళారు. పరిస్థితి చేయి దాటిపోయిందని అక్కడి వైద్యులు పన్నెండు మైళ్ళ దూరంలో ఉన్న మరొక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి మరింత ప్రమాదస్థాయికి చేరుకుందని, అక్కడి డాక్టరు జిల్లా ఆసుపత్రికి తరలించమన్నారు. భీమ్‌సేన్‌లో భయాందోళనలు మొదలయ్యాయి.

కృష్ణ : భీమ్‌సేన్ అప్పుడేం చేశాడు?

శ్రీకాంత్: డాక్టర్ల సలహా ప్రకారం భార్యను జిల్లా ఆసుపత్రికి తరలించాడు. అక్కడ ఎక్స్‌రే తీసి బిడ్డ చనిపోయిందనీ తల్లి బలహీనంగా ఉంది కాబట్టి ఆపరేషన్‌కి తట్టుకోలేదనీ, ధనుర్వాతం కూడా రావచ్చునీ అక్కడి వైద్యులు చెప్పారు. అప్పుడు భీమ్‌సన్ "స్వామీ నేనే పాపం చేయలేదు. నీతి నిజాయితీలతో బ్రతికాను. నీ పాదారవిందాలనే నమ్ముకున్నాను. కాపాడు తండ్రీ" అని కన్నీరు కార్చాడు. ఏడ్చి ఏడ్చి ఆ ఆసుపత్రి అరుగు మీదే అలసిపోయి నిద్రపోయాడు. తెల్లవారుఝామున నర్సు నిద్ర లేపి అతని భార్య పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిందని చెప్పింది. ఆనంద భాష్పాలు కురుస్తుండగా దీనుల మొరనాలకించే దీనానాధుడు నా బంగారుతండ్రి భగవాన్ శ్రీ సత్యసాయి అనీ, జన్మజన్మలకూ వారి పాదాలను వదలిపెట్టననీ బాబాకు కృతజ్ఞతాంజలి సమర్పించుకున్నాడు భీమ్‌సేన్.

శేఖరం: చూశావా కృష్ణా! పూర్ణ ప్రేమావతార మూర్తి శ్రీకృష్ణపరమాత్మ దివ్య జీవితానికీ పరిపూర్ణ ప్రేమావతారమూర్తి భగవాన్ శ్రీసత్యసాయిబాబా వారి దివ్య జీవితానికీ ఎంత సారూప్యం ఉందో. ఇంకా నీకు సందేహాలున్నాయా?

కృష్ణ : శేఖరం! ఇంక నాకే సందేహాలూ లేవు. ఆ శ్రీకృష్ణ భగవానుడే భగవాన్ శ్రీ సత్యసాయి. ఆ సాయికృష్ణుని పాదాలనాశ్రయిస్తాను. వారి దివ్య నామ సంకీర్తన చేసుకుంటాను. వారుపదేశించిన దీనజనుల సేవలోనే నా జీవితం ధన్యం చేసుకుంటాను. సాయి కృష్ణా! పాహిమాం! పాహిమాం!

(పిల్లలు నృత్యం చేస్తూ ప్రవేశిస్తారు)

పల్లవి : నా నోట శ్రీ సాయి నామమున్నది
మదిలోన సాయి రామ మంత్రమున్నది
సాయిసాయి శరణం శ్రీ సత్యసాయి శరణం ॥నానోట॥

చ. 1. ఆ పర్తి నిలయాన హాయి ఉన్నది
ఆ సాయి నామమెంతో తియ్యగున్నది
ఆ సాయి రూపాలు అచ్చమైనవి
ఆ సాయి హితబోధ ముచ్చటైనది ॥నానోట॥

చ. 2. సత్యము సాయిలో కొలువైనది
శివమది సాయిలోన వెలుగైనది
సుందరము రామన్న యందున్నది
కమ్మని సన్నిధికి రమ్మన్నది ॥నానోట॥

0 0 0